



# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680

సంపుటి : 3 | సంచిక : 261 | మే 19 మంగళవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...

9490056011,9603969335


## ప్రశ్నించిన రిపోర్టర్లపై

# సర్పంచ్ బూత్ పురాణం..!

### నన్నే అడుగుతావా.. చంపేస్తా అంటూ బెదిరింపులు..!

- అక్రమాలపై ప్రశ్నిస్తే రిపోర్టర్లపైనే ఎదురుదాడి
- అగ్రకుల అహంకారంతో రిపోర్టర్ లపై రెచ్చిపోయిన సర్పంచ్
- అక్రమాలను ప్రశ్నిస్తే ర్యాగింగ్ చేశారంటూ కార్యదర్శి కట్టుకథలు
- కార్యదర్శి ,సర్పంచ్ కలిసి రిపోర్టర్ లపై స్టేషన్ లో అక్రమ పిటిషన్
- గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు.. అధికారుల మౌనంపై చర్చనీయాంశం




**మన దునియా,నిజామాబాద్ జిల్లా,మోపాల్,తాడేం:మే18**

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం తాడేం గ్రామ పంచాయతీలో జరుగుతున్న అక్రమాలు, అభివృద్ధి పనుల్లో అవకతవకలు, నిధుల వినియోగంపై సమాచారం కోరిన మీడియా ప్రతినిధులపై సర్పంచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన ప్రస్తుతం గ్రామ రాజకీయాలను వేడెక్కిస్తోంది. ప్రజల తరపున ప్రశ్నించిన రిపోర్టర్లను సర్పంచ్ బూతులు తిట్టడమే కాకుండా, “నన్నే ప్రశ్నిస్తావా.. నిన్ను చంపేస్తా” అంటూ బెదిరింపులకు దిగినట్లు ఆరోపణలు రావడం సంచలనంగా మారింది.గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై ఇటీవల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పంచాయతీ నిధుల వినియోగం, బిల్లుల మంజూరు, పనుల నాణ్యత, అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాలపై గ్రామ ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో విషయాలను సేకరించేందుకు వెళ్లిన రిపోర్టర్లు సంబంధిత వివరాలు అడగగా, సర్పంచ్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన స్థానంలో మీడియాపైనే దూకుడుగా వ్యవహరించడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, సర్పంచ్ కొంతకాలంగా అగ్రకుల అహంకారంతో గ్రామంలో ఏకపక్ష ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ సమస్యలపై మాట్లాడిన వారిపై ఒత్తిడి తీసుకురావడం, ఎదురు మాట్లాడితే బెదిరింపులకు దిగడం వంటి ఘటనలు గతంలో కూడా జరిగాయని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అయితే ఈసారి నేరుగా మీడియా ప్రతినిధులనే లక్ష్యంగా చేసుకోవడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఇదిలా ఉండగా, గ్రామంలో జరుగుతున్న అక్రమాలపై ప్రశ్నించిన రిపోర్టర్లపైనే “ర్యాగింగ్ చేశారు” అంటూ గ్రామ కార్యదర్శి కొత్త ఆరోపణలు చేయడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా

(మిగతా 2వ పేజీలో..)

## కేరళం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్

**మన దునియా,తిరువనంతపురం,మే18**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది..




## బండి భగీరథ్ కేసు.. కొత్త సెక్షన్‌ను జోడించిన పోలీసులు

**మన దునియా,హైదరాబాద్,మే18**

బండి భగీరథ్ కేసులో పోలీసులు కొత్తగా మరో సెక్షన్‌ను జోడించారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఆరోపణల నేపథ్యంలో దీఛీూ 64(2)(ఎ) సెక్షన్‌ను కేసులో చేర్చారు. ఈ సెక్షన్ రుజువైతే కనీసం 10 సంవత్సరాలు జైలు శిక్ష లేదా జీవిత ఖైదు పడే అవకాశం ఉంది. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే బండి భగీరథ్‌పై BNS 64(2)(ఎ),




## కేంద్ర మంత్రి పదవికి ఈటల రాజేందర్ పేరు..?

**తెలంగాణ బీజేపీలో జోరుగా ప్రచారం**

**మన దునియా,న్యూఢిల్లీ/ హైదరాబాద్:మే18**

తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన భగీరథ్ పోక్సో కేసు వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో కూడా హాట్ టాపిక్‌గా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ పరిణామాలు, కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాల మధ్య తెలంగాణకు చెందిన నేతలకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై జోరుగా ప్రచారం జరుగుతోంది.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో భారీ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశమున్నట్లు ఢిల్లీ భారతీయ జనతా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రాల వారీగా రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల

(మిగతా 2వ పేజీలో..)




# ఐపీఎల్‌ను నిలిపి వేయండి

**మన దునియా,న్యూఢిల్లీ:మే18**

ఐపీఎల్ 2026 సీజన్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, ముఖ్యంగా అమెరికా-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఘర్షణల నేపథ్యంలో ఇంధన సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొంటూ కాంగ్రెస్ నేతలు ఈ డిమాండ్ చేస్తున్నారు.ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు మంత్రాన్ని జపించిన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత భూపేశ్ బాఘేల్ తాజాగా స్పందించారు. సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ చేస్తూ.. ఐపీఎల్‌ను వెంటనే నిలిపివేయాలని మోదీని

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# బండి భగీరథ్ కేసు.. కొత్త సెక్షన్‌ను జోడించిన పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

BNS 74, BNS 75 సెక్షన్లు, POCSO సెక్షన్ 5(1) r/w 6 సెక్షన్లు నమోదు చేశారు. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు ఈ కొత్త సెక్షన్‌ను జోడించారు.బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 8న బండి భగీరథ్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసినప్పటికీ గైర్హాజరయ్యారు. హైకోర్టులో మధ్యంతర బెయిల్ కోసం భగీరథ్ పిటిషన్ వేయగా.. అక్కడ కూడా అతడికి నిరాశే ఎదురైంది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించడంతో.. భగీరథ్ పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. భగీరథ్‌ను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీలో చెర్లపల్లి జైలుకు పోలీసులు తరలించారు..

# ప్రశ్నించిన రిపోర్టర్లపై సర్పంచ్ బూత్ పురాణం..!

ప్రజా సమస్యలపై స్పందించాల్సిన కార్యదర్శి, సర్పంచ్‌కు మద్దతుగా వ్యవహరించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు అక్రమాలపై సమాధానం చెప్పకుండా, ప్రశ్నించిన వారిపైనే కేసుల బెదిరింపులు చేయడం వెనుక కుట్ర ఉందా..? అనే చర్చ గ్రామంలో జోరుగా సాగుతోంది.అంతేకాకుండా సర్పంచ్, కార్యదర్శి కలిసి రిపోర్టర్లపై పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ ఇవ్వడం కూడా వివాదాస్పదంగా మారింది. మీడియా వర్గాల సమాచారం ప్రకారం, అక్రమాల అంశాన్ని మళ్లించేందుకే ఈ పిటిషన్‌ను ఆయుధంగా ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రశ్నించే హక్కును అణగదొక్కడానికి ఈ చర్యలు చేస్తున్నారంటూ జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి.గ్రామ ప్రజల్లో కూడా ఈ వ్యవహారంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఒకవైపు అభివృద్ధి పనులపై అనుమానాలు, మరోవైపు మీడియాపై బెదిరింపులు, పోలీస్ పిటిషన్లు వంటి పరిణామాలతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొందరు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.“ప్రజల డబ్బు ఎక్కడ ఖర్చు అయింది..? పనులు నాణ్యంగా జరిగాయా..? గ్రామంలో ఎవరు ప్రశ్నించినా బెదిరింపులేనా..?” అంటూ గ్రామస్తులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మీడియాపై దాడులు, బెదిరింపులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ చేపట్టి నిజానిజాలు వెలుగులోకి తేవాలని గ్రామ ప్రజలు, జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి: కేటీఆర్

మన దునియా,హైదరాబాద్,మే 17.



పోక్సో చట్టం కింద బండి భగీరథ్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్ బీ నగర్‌లో నిర్వహించిన ‘నా బూత్.. నా భవిష్యత్తు’ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధాని మోదీ ‘బేటీ పడావో.. బేటీ బచావో’ అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ..బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ కేంద్రమంత్రి సంజయ్‌పై ఆయన నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారతదేశానికి కూడా అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్ర మంత్రి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు.ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానీవ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించి.. ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా జరిపించాలని కేంద్రానికి ఆయన స్పష్టం చేశారు.కేంద్రమంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా.. ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా కొట్లాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు..

# కేంద్ర మంత్రి పదవికి ఈటల రాజేందర్ పేరు..?

(మొదటి పేజీ తరువాయి)

ప్రాతినిధ్యం, రాబోయే ఎన్నికల వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని కీలక మార్పులు ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ క్రమంలో తెలంగాణకు చెందిన పలువురు నాయకుల పేర్లు చర్చకు వస్తుండగా, ముఖ్యంగా మల్కాజ్‌గిరి ఎంపీ, తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నట్లు సమాచారం. ఆయనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి అప్పగించే అవకాశాలపై ఢిల్లీ రాజకీయ, భారతీయ జనతా పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతున్నట్లు సమాచారం.తెలంగాణలో బీసీ సామాజిక వర్గ సమీకరణాలు, పార్టీ విస్తరణ, రాబోయే ఎన్నికల వ్యూహాలు, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అధిష్టానం ఆలోచిస్తున్న నేపథ్యంలో ఈటల రాజేందర్‌కు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి.మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పదవిపై కూడా రాజకీయ చర్చ మొదలైంది. భగీరథ్ పోక్సో కేసు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ విమర్శలు, ప్రతిపక్ష పార్టీల నిరసనలు, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న చర్చలతో బండి సంజయ్‌పై ఒత్తిడి పెరిగినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణకు సంబంధించి మార్పులు జరిగే అవకాశాలపై ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.అయితే, కేంద్ర మంత్రివర్గ విస్తరణ, పదవుల మార్పులు, కొత్త నియామకాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం వినిపిస్తున్న అంశాలు రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారం, ఊహాగానాలుగానే చూడాల్సి ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. కేంద్ర అధిష్టానం నిర్ణయాల తర్వాతే దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఐపీఎల్‌ను నిలిపి వేయండి

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. స్టేడియాలకు వేలాది మంది అభిమానులు ప్రయాణించడం వల్ల భారీగా ఇంధనం వినియోగమవుతోందని, విదేశీ ఆటగాళ్లకు డాలర్లలో చెల్లింపులు జరుగుతున్నాయని, బెట్టింగ్ కార్యకలాపాలు కూడా పెరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.“ప్రధానమంత్రి గారు, వెంటనే ఐపీఎల్‌ను ఆపేయండి. దీంతో ఇంధనం ఆదా అవుతుంది. విదేశీ కరెన్సీ చెల్లింపులు తగ్గుతాయి. బెట్టింగ్ కూడా ఆగుతుంది” అంటూ బాఫేల్ తన పోస్టులో రాసుకొచ్చారు.బాఫేల్ చేసిన ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతుంది. నెటిజన్లు బాఫేల్ వర్షన్‌ను సమర్థిస్తూ ఐపీఎల్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. మోదీ కేవలం మాటలకే పరిమితం కాకుండా పొదుపు మంత్రాన్ని ఆచరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై నెట్టింట డిబేట్లు నడుస్తున్నా, కేంద్ర ప్రభుత్వం నుంచి గానీ, ఐపీఎల్ నిర్వాహకులు నుండి గానీ ఎలాంటి స్పందన లేదు.కాగా, దేశంలో ఇటీవల పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. త్వరలో ఈ పెంపు మరింత ఎక్కువ కానుందన్న సంకేతాలు కూడా అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి విషయంలో ఇంధనంతో ముడిపడి ఉన్న ఐపీఎల్‌ను కొనసాగించడం? సబబు కాదని సగటు భారతీయుడు అభిప్రాయపడుతున్నాడు. మరోపక్క ఇంకో వర్షన్ కూడా వినిపిస్తుంది. టోర్నీ ముగియడానికి కేవలం రెండు వారాల సమయం మాత్రమే ఉండటంతో ఈ దశలో సస్పెండ్ చేస్తే భారీ ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ ఆదాయం, ఫ్రాంచైజీల వ్యాపార ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు.

# విజయ్ ప్రభుత్వం ఆరు నెలలకు మించి ఉండదు.. డీఎంకే ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు నెలలు మాత్రమే మనుగడ సాగిస్తుంది. ఆధవ్ అర్జున ధైర్యం ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. నేను కూడా చేస్తాను. ఇద్దరం తిరుచెందూర్‌లో పోటీ చేద్దాం. ఇది మా అడ్డా. ఇక్కడ ఎవరినైనా ఓడిస్తాం” అని రాధాకృష్ణన్ సవాల్ విసిరారు. గత 25 ఏళ్లుగా తిరుచెందూర్ స్థానం రాధాకృష్ణన్‌కు బలమైన కోటగా ఉంది. కొళత్తూర్ స్థానంలో మాజీ డీఎంకే నేత వీఎస్ బాబు (టీవీకే) చేతిలో ఓడిపోయిన స్టాలిన్‌ను రాధాకృష్ణన్ ఈ సందర్భంగా వెనకేసుకొచ్చారు. కొళత్తూర్‌ను స్టాలిన్ సింగపూర్‌లా మార్చారని చెబుతూ.. అక్కడి ఓటర్లను ‘పనికిరానివారు’ అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమ నాయకుడు స్టాలిన్ తదుపరి ముఖ్యమంత్రి అవుతారని, ఆయనను తిరుచ్చి నుంచి పోటీ చేయిస్తామని చెప్పారు. తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాల తర్వాత ద్రవిడ పార్టీల నుంచి అధికారం పోవడం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని 234 స్థానాలకుగానూ టీవీకే ఒంటరిగానే 108 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 62 ఏళ్లుగా తమిళనాడును పాలిస్తున్న డీఎంకే, ఏఐఏడీఎంకేల జోరుకు విజయ్ బ్రేక్ వేశారు. ఈ నేపథ్యంలో అనితా రాధాకృష్ణన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఆయన వ్యాఖ్యలపై ఇప్పటి వరకు టీవీకే నేతలు స్పందించలేదు.

# హెచ్1బీ వీసా అలర్ట్.. ఈ కారణంతో కూడా మీకు నో చెప్పవచ్చు!

**హెచ్-1బి, గ్రీన్ కార్డు దరఖాస్తులపై అమెరికా కొత్త నిబంధనలు**

**సంతకం సరైంది కాకపోతే అప్లికేషన్ తిరస్కరణకు అవకాశం**

**దరఖాస్తు తిరస్కరించినా ఫైలింగ్ ఫీజు తిరిగి ఇవ్వరు**

**జూలై 10 నుంచి అమల్లోకి రానున్న తాత్కాలిక తుది నియమం**

అమెరికాలో హెచ్-1బి వీసా, గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారికి అక్కడి ఇమ్మిగ్రేషన్ సంస్థ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇమ్మిగ్రేషన్ ఫారమ్‌లపై సరైన సంతకం లేకపోతే, దరఖాస్తును తిరస్కరించే ప్రమాదం ఉందని, పైగా ఫైలింగ్ కోసం చెల్లించిన ఫీజును కూడా తిరిగి ఇవ్వబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్ సీఐఎస్) కొత్త నిబంధనలను ప్రకటించింది.అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ (డీహెచ్ఎస్) ప్రకారం, నకిలీ సంతకాలతో దాఖలవుతున్న దరఖాస్తులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ కఠిన నిబంధనను తీసుకొచ్చారు. ఈ తాత్కాలిక అంతిమ నియమం (ఇంటెరిమ్ ఫైనల్ రూల్) ఈ ఏడాది జూలై 10 నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానం ప్రకారం, ఒకసారి దరఖాస్తును స్వీకరించిన తర్వాత కూడా, పరిశీలన దశలో సంతకం చెల్లదని తేలితే దానిని తిరస్కరించే అధికారం యూఎస్ సీఐఎస్ కు ఉంటుంది.ఈ విధంగా తిరస్కరణకు గురైన దరఖాస్తుదారులకు ఫైలింగ్ ఫీజు కింద చెల్లించిన వేలాది డాలర్లు నష్టపోవాల్సి వస్తుంది. ఎందుకంటే, సంతకం కారణంగా తిరస్కరించినా ఆ కేసును పూర్తిగా పరిశీలించినట్టుగానే పరిగణిస్తామని యూఎస్ సీఐఎస్ పేర్కొంది. ఇది దరఖాస్తుదారుల ఇమ్మిగ్రేషన్ స్టేటస్, వర్క్ పర్మిట్, ప్రయారిటీ డేట్స్ వంటి వాటిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఏ సంతకాలు చెల్లవంటే..!

చేతిరాతతో చేసిన అసలైన సంతకాలు (వెట్-ఇంక్) ప్రామాణికంగా ఉంటాయి. వాటిని స్కాన్ చేసినా, ఫ్యాక్స్ చేసినా లేదా ఫోటోకాపీ తీసినా సాధారణంగా అంగీకరిస్తారు. అయితే కాపీ-పేస్ట్ చేసిన సంతకాలు, డిజిటల్‌గా రూపొందించినవి, సంతకం స్టాంపులు, పదేపదే వాడిన సంతకం ఇమేజ్‌లను చెల్లనివిగా పరిగణిస్తారు. కేవలం యూఎస్ సీఐఎస్ అధికారిక ఆన్‌లైన్ ఫైలింగ్ పోర్టళ్లలో మాత్రమే ఎలక్ట్రానిక్ సంతకాలు చెల్లుబాటు అవుతాయి. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులు, యజమానులు ఫైలింగ్ ప్రక్రియలో మరింత జాగ్రత్త వహించడం తప్పనిసరి.



# ఆశా వర్కర్ల హామీలు వెంటనే అమలు చేయాలి

**బిఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్**

**బిఎమ్మెల్యే సతీమణి సురేఖ మేడంకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం**

**మన దునియా, మంచిర్యాల; మే 18.**



మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సతీమణి సురేఖ మేడంకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. గత ఇరవై సంవత్సరాలుగా ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఆశా వర్కర్లలో అధిక శాతం మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలేనని, అయినప్పటికీ ఇప్పటికీ వారికి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు కనీస గ్యారెంటీ ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలుగా నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2023లో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నిరవధిక సమ్మె సందర్భంగా ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా వేతనాలు పెంపు, ఉద్యోగ భద్రత వంటి అంశాలను ప్రస్తావించిందని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు హామీలు అమలు కాలేదని విమర్శించారు. అదేవిధంగా ఆశా వర్కర్లకు ప్రకటించిన రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హామీలు అమలు చేయాలని కోరారు. పీఆర్‌సీ ఎరియర్స్, లెప్రసీ, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీలకు సంబంధించిన బకాయిలు కూడా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సంకె రవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శోభ, జిల్లా కమిటీ సభ్యురాలు సువర్ణ, సీఐటీయూ నాయకులు కస్తూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అక్రమ డిప్యుటేషన్లపై ఫిర్యాదు

**తక్షణ విచారణకు ఆదేశాలు -- అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేస్తామని అడిషనల్ డైరెక్టర్ హామీ**

**మన దునియా**




నాగర్‌కర్నూల్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ డిప్యుటేషన్లపై రైట్ టు ఇన్ఫర్మేషన్ సేవా సొసైటీ (ఆర్టీఐఎస్ఎస్) జాతీయ అధ్యక్షుడు కె. బాబురామ్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీ వి. సర్వేశ్వర్ రెడ్డికి రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో అధికారులు సమస్యలను సానుకూలంగా స్వీకరించారు. ఈ సందర్భంగా బాబురామ్ నాయక్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి కొందరు ఉపాధ్యాయులకు వ్యక్తిగత అనుకూలతల ఆధారంగా అక్రమ డిప్యుటేషన్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఒకే పాఠశాలలో అవసరానికి మించి ఉపాధ్యాయులను వార్డెన్లుగా లేదా అదనపు సిబ్బందిగా నియమించడం వల్ల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరుగుతోందని విమర్శించారు. అలాగే కొన్ని పాఠశాలల్లో అసలు సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడం వల్ల విద్యా వ్యవస్థ దెబ్బతింటోందని, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులర్ ఉపాధ్యాయులను ఇతర చోట్లకు పంపించడం వల్ల పలు పాఠశాలలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయని పేర్కొన్నారు. కల్వకుర్తి, జంగంరెడ్డిపల్లి, మన్ననూర్, ఉడిమిల్ల, చెంచుగూడం, లింగాల, నార్లాపూర్ ప్రాంతాల బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళా సిబ్బంది స్థానంలో పురుష సిబ్బందిని కొనసాగించడం విద్యార్థినుల భద్రతకు ముప్పుగా మారిందని ఆరోపిస్తూ వెంటనే మహిళా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదుపై స్పందించిన అడిషనల్ డైరెక్టర్ శ్రీ వి. సర్వేశ్వర్ రెడ్డి, గిరిజన విద్యార్థుల విద్యా హక్కులు మరియు బాలికల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిన అక్రమ డిప్యుటేషన్లపై తక్షణమే లోతైన విచారణ జరిపిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న డిప్యుటేషన్లను రద్దు చేసి ఉపాధ్యాయులను వారి అసలు పోస్టింగ్ స్థానాలకు పంపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అడిషనల్ డైరెక్టర్ స్పందనపై హర్షం వ్యక్తం చేసిన బాబురామ్ నాయక్, గిరిజన విద్యార్థుల విద్యా హక్కుల పరిరక్షణలో నిర్లక్ష్యం కొనసాగితే కమిషనరేట్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐఎస్ఎస్ ప్రతినిధులు, సొసైటీ సభ్యులు మరియు గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# టీజీ ట్రాన్స్‌కోలో ఓడిఎమ్ సిబ్బందికి ప్రమోషన్లలో తీవ్ర అన్యాయం

**జేఎల్ఎంలను పట్టించుకోని యాజమాన్యం..**
**ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు**

**మన దునియా**

టీజీ ట్రాన్స్‌కోలో ప్రమోషన్ల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. ముఖ్యంగా ఓ డఎమ్ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) విభాగంలో పనిచేస్తున్న జేఎల్ఎంలకు ప్రమోషన్లు ఇవ్వకుండా యాజమాన్యం వివక్ష చూపుతోందని ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీర్లు, జేఏఓలు, జేపీవోలకు ప్రమోషన్లు కల్పించిన యాజమాన్యం, జేఎల్ఎంల విషయంలో మాత్రం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో జేఎల్ఎంలకు ప్రమోషన్లు ఇచ్చినా, ట్రాన్స్‌కోలో మాత్రం ఇప్పటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగకపోవడం గమనార్హమని అంటున్నారు. ఫీల్డ్‌లో 24 గంటలు శ్రమిస్తూ విద్యుత్ వ్యవస్థను నిలబెట్టే ప్రధాన బలం ఓడఎమ్ సిబ్బందేనని, అయినప్పటికీ వారికి సరైన గుర్తింపు లేకపోవడం బాధాకరమని ఉద్యోగులు పేర్కొంటున్నారు. చాలామంది కాంట్రాక్ట్, ఆర్టిజన్ హోదాల్లో 15 నుంచి 20 సంవత్సరాలు పనిచేసి జేఎల్ఎంలుగా నియమితులయ్యారని, ప్రస్తుతం వారి సర్వీస్‌ను తక్కువగా చూపుతూ ప్రమోషన్లకు దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీజీ ట్రాన్స్‌కోలో దాదాపు 350కు పైగా ఏఎల్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో యాజమాన్యం స్పందించడం లేదని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేసి, జేఎల్ఎంలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# ఓయో రూమ్ వీడియోలతో ప్రభుత్వ అధికారికి మహిళ వేధింపులు..

**మన దునియా,హైదరాబాద్,మే18**




నగరంలోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి హనీ ట్రాప్ కావడం సంచలనం సృష్టిస్తోంది. ఓయో రూమ్‌లో రికార్డు చేసిన ప్రైవేట్ ఫోటోలు, వీడియోలను చూపిస్తూ ఒక మహిళ సదరు అధికారిని గత మూడేళ్లుగా బ్లాక్‌మెయిల్ చేస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేసింది. చివరకు బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ ముఠా భాగోతం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... ఖైరతాబాద్ రేషన్ సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న ఒక ప్రభుత్వ ఉన్నతాధికారికి గతంలో ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో వారిద్దరూ కలిసి ఒక ఓయో హోటల్ గదికి వెళ్లారు. అయితే, ఆ సమయంలో సదరు మహిళ అధికారికి తెలియకుండా వారిద్దరి ప్రైవేట్ ఫోటోలను, వీడియోలను మొబైల్‌లో రికార్డు చేసింది. ఆ వీడియోలను ఆసరాగా చేసుకుని సదరు మహిళ అసలు రంగు బయటపెట్టింది. డబ్బులు ఇవ్వాలని లేదంటే సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించడం మొదలు పెట్టింది. అలా గత మూడేళ్లుగా ఆమె సదరు అధికారి నుండి భారీగా డబ్బులు వసూలు చేస్తూ, మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేసింది. ఇక భరించలేకపోయిన ఖైరతాబాద్ రేషన్ సర్కిల్ అధికారి చివరకు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించారు. తనను బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు గుంజుతున్న మహిళపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితురాలైన మహిళపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు..

# సర్కారు భూములను స్వాహా చేస్తున్నారు..

**ఫిర్యాదు చేసిన స్పందించడం లేదేం..**

**రెవిన్యూ కార్యాలయం తీరుపై షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆగ్రహం..**

**ప్రభుత్వ భూములు వెంటనే స్వాధీనం చేసుకోవాలని తహసిల్దార్ కు లేఖ..**

**మన దునియా,షాద్ నగర్:మే 18**




ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా అమ్ముకుంటూ వ్యాపారాలు చేసుకుంటున్నా అధికారుల దృష్టికి రావడం లేదని, తాము దృష్టికి తెచ్చిన అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు షాద్ నగర్ ఎమ్మార్వో కు లేఖ రాశారు. ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 92/1 ఎకరా మూడు గుంటల పోరంబోకు షాబాద్ మండలం సర్దార్ నగర్ నివాసి లావుని పట్టా ఇవ్వడం జరిగిందన్నారు. కాదా ఈ భూమిని ఎలికట్ట రామచంద్రయ్య నారాయణ, మల్లేశం అనే వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి అమ్మాడని పేర్కొన్నారు. అదేవిధంగా సర్వేనెంబర్ 140 లో 12.03 ఎకరాల భూమిని షాబాద్కు చెందిన ఓ బట్టల వ్యాపారికి అమ్మి ప్రభుత్వ భూమిని సంపన్నుడికి సొంతం చేశారని పేర్కొన్నారు. దీనిపై గత ఫిబ్రవరి 20వ తేదీన తాను ఫిర్యాదు చేసిన పనికి ఇప్పటిదాకా స్పందించలేదన్నారు. అక్రమంగా లావుని పట్టా పొందిన గోపాల్ మృతిచెందగా అతని కుమారులు సిద్ధి లింగం, రాజలింగం, వెంకటేష్ జిఎంఆర్ సంస్థకు చెందిన ఒక ఉద్యోగికి విరాసత్ చేశారని ఆరోపించారు. గోపాల్ కుమారుడైన వెంకటేష్ ఎవరికి అనుమానం రాకుండా ఇక్కడ ఒక షెడ్ వేసి వ్యవసాయం చేస్తున్నట్లు నటిస్తున్నాడని పేర్కొన్నారు. మూడు కోట్ల విలువైన ఈ భూమి షాబాద్-షాద్ నగర్ మార్గంలో రోడ్డు భవనాల శాఖ కు అందుబాటులో ఉందన్నారు. దీనిపై విచారణ జరిపి పట్టాను రద్దుచేసి భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలకు ఉపయోగించాలని సూచించారు..

# ఎప్ సెట్‌లో అద్భుత ర్యాంక్ సాధించిన విద్యార్థిని సన్మానించిన భుక్య జాన్సన్ నాయక్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా మే;18.**



ఖానాపూర్ పట్టణంలోని ఎం.జె.పి పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద, అనాథ విద్యార్థిని తోకల ముత్తవ్వ (సుప్రియ) ఎప్ సెట్‌లో 2047 ర్యాంక్ సాధించి ప్రతిభ కనబర్చిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రులు లేకపోవడం వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ కూడా ముత్తవ్వ పట్టుదలతో చదివి ఈ విజయాన్ని సాధించడం గొప్ప విషయమన్నారు. ఆమె సాధించిన ర్యాంక్ ఖానాపూర్ ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. విద్యతోనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, కష్టపడి చదివితే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించవచ్చని ముత్తవ్వ నిరూపించిందన్నారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఉన్నత విద్య కోసం అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇలాంటి ప్రతిభావంతులైన పేద విద్యార్థులను సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# పీసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం పంపిణీ

**ఖానాపూర్ ఆర్సి మన దునియా మే:18.**



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం టీజీ పల్లె గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొట్టే వెంకటేష్ కుటుంబానికి పీసీఆర్ పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నోముల రాజ్ కుమార్, మున్వర్ అలీ ఖాన్, ఫజల్, వినయ్, దేవయ్య, శ్రీను, సాయి, మహేష్, శివలింగు, తిరుపతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ పర్యటన

**వడ్ల కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి.. రైతులకు అండగా ములుగు జిల్లా పోలీసులు**

**వడ్ల రవాణా, తూకం అక్రమాలపై చర్యలు తీసుకుంటాం**

**రైతులకు న్యాయం జరిగేలా చర్యలు**

**జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్**



**మన దునియా,ములుగు జిల్లా జంగాలపల్లి:మే18**

ములుగు జిల్లా జంగాలపల్లి వద్ద కల్లాన్ని జిల్లా ఎస్పి శ్రీ కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ స్థానిక అధికారులైన ములుగు డిఎస్పి రవీందర్, స్థానిక సీఐ ఎస్ఐ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.రైతులు మాట్లాడుతూ, వడ్లను రైస్ మిల్లులకు తరలించేందుకు సరిపడా రవాణా సదుపాయాలు లేక ఆలస్యం జరుగుతోందని, దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎస్పికి వివరించారు. అదేవిధంగా రైస్ మిల్లుల వద్ద కాంటా తూకంలో అధికంగా వడ్లు కట్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.రైతుల సమస్యలను విన్న ఎస్పి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రైతులకు తెలిపారు, రైతుల సమస్యల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ రైతులకు అన్ని సమయాలలో అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు.అనంతరం అబ్బాపూర్‌లోని శ్రీ మాతా ఆగ్రో టెక్ పారా బాయిల్డ్ రైస్ మిల్లును ఎస్పి పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం, రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాంటా తూకం యంత్రాన్ని, వడ్ల నాణ్యత తనిఖీ ప్రక్రియను పరిశీలించారు.రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లు పారదర్శకంగా కొనుగోలు చేయాలని, తూకం విషయంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి ఎస్పి ఆదేశించారు తూకంలో తేడాలు గమనిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోగల వడ్ల కళాలను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రోజువారి ఎగుమతి పై నివేదిక ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు.

# నీట్ పేపర్ లీక్ కేసులో మరో అరెస్ట్.. మొత్తం అరెస్టుల సంఖ్య 10కు చేరింది

**మన దునియా,న్యూఢిల్లీ:మే18**

దర్యాప్తు చేస్తున్న నీట్ పేపర్ లీక్ కేసులో మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. శివరాజ్ మొటెగంకర్‌ను సీబీఐ అదుపులోకి తీసుకుంది.శివరాజ్ మొబైల్ ఫోన్‌లో నీట్ ప్రశ్నాపత్రం ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆధారాల మేరకు అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఇప్పటివరకు ఈ కేసులో మొత్తం 10 మందిని సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది.




# సనాతన ధర్మంలో గోవు మన కామధేనువు





- **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
- **పెంజర్ల గ్రామంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ లోని గోశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన షాద్ నగర్ షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మన్నే జీవన్ రెడ్డి..**

**మన దునియా,షాద్ నగర్,మే18**

సనాతన ధర్మంలో గోవును కామధేనువుగా భావిస్తారనీ గోశాలలలో గోసేవ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అలాగే, గోశాలల నిర్వహణ ద్వారా స్థానికులకు మరియు రైతులకు ఉపాధి లభిస్తుందనీ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ లోని గోశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మన్నే జీవన్ రెడ్డి, ఈ సందర్భంగా ఆలయ కమిటి బెజవాడ అనిత రెడ్డి మాజీ జడ్పిటిసి శ్యామ్ సుందర్ రెడ్డి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ , గ్రామ సర్పంచ్ జగన్,కొమ్ము కృష్ణ సుదర్శన్ గౌడ్ సిద్దాపూర్ శేఖర్ రెడ్డి, అంబటి ప్రభాకర్ విగ్నేష్ రెడ్డి కుమారస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# అర్ధరాత్రి గజబలం...





**ఏనుగుల గుంపు కలకలం..!!**

**బైకర్‌ను వెంటాడిన ఏనుగులు!**

**మన దునియా,తిరుపతి జిల్లా చంద్రగిరి:మే18**

తిరుపతి జిల్లా చంద్రగిరి పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో అర్ధరాత్రి ఏనుగుల గుంపు కలకలం సృష్టించింది.చంద్రగిరి ?భాకరాపేట ఘాట్ రోడ్డులో ఏనుగుల కలకలం సృష్టించడంతో సుమారు 3 గంటలకు పైగా ఘాట్ రోడ్డు లో వాహనాలు నిలిచిపోయాయి. వెంటాడిన ఏనుగుల గుంపు.. అర్ధరాత్రి ద్విచక్ర వాహనదారుడిని వెంటాడిన ఏనుగుల గుంపు ?తో ప్రాణాలతో తృటిలో తప్పించుకున్నాడు.అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా.. అటవీ సిబ్బంది ?గంటలకొద్దీ శ్రమించి ఏనుగులను అడవిలోకి మళ్లించారు.. ?ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు ఏనుగులు వెళ్లిన తర్వాతే రాకపోకలు పునరుద్ధరణ సాగించారు.

# హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ భారీ నిరసన






**బండి సంజయ్ బర్తరఫ్ చేయాలంటూ గర్జించిన గులాబీ శ్రేణులు**

**మన దునియా హుజూరాబాద్ నియోజకవర్గం**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హుజురాబాద్ బి ఆర్ ఎస్ ఎమ్ ఎల్ ఏ,ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ నిరసనకు నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.నిరసన ప్రదర్శనలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గట్టిగా నినాదాలు చేసిన గులాబీ శ్రేణులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల తరపున పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో దేశ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. బండి సంజయ్ వ్యాఖ్యలు, వ్యవహార శైలి ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శిస్తూ వెంటనే ఆయనను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.భారీగా హాజరైన కార్యకర్తలతో హుజూరాబాద్ పట్టణం గులాబీ జెండాలతో కాషాయానికి సవాల్ విసిరినట్టుగా కనిపించింది. నిరసన కార్యక్రమం ప్రశాంతంగా సాగినా రాజకీయ వేడి మాత్రం స్పష్టంగా కనిపించింది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మే | మంగళవారం | 19 | 2026


# పాలకులూ..పాలమూరు సాగునీరుపై స్పందించండి..!

**మంత్రి జూపల్లి కృష్ణారావుకు పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల సాధన కమిటీ విజ్ఞప్తి..**

**పాలమూరు జిల్లా రైతాంగానికి తీవ్రంగా నష్టం చేసే డిండి లిఫ్టు రద్దు చేయాలి**

**ప్రత్యామ్నాయంగా నాగార్జునసాగర్ బొట్టుముక్కల వద్ద లెఫ్ట్ పనులు చేపట్టాలి**

**వినతి పత్రాన్ని అందజేసిన జేఏసీ నాయకులు రాజేందర్ రెడ్డి, రాఘవాచారి తదితరులు..**

**మన దునియా,మహబూబ్ నగర్: మే18**

పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులపై వెంటనే స్పందించి సాగునీటి సమస్యలు తీర్చాలని, ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాలని "మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన కమిటీ" నాయకులు జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందించారు. జేఏసీ నాయకులు రాజేందర్ రెడ్డి, రాఘవాచారి, బెక్కెం జనార్ధన్, చెన్న కిష్టయ్య, టీజీ శ్రీనివాస్ వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగానికి తీవ్రంగా నష్టం చేసే డిండి లిఫ్టు రద్దుచేసి ప్రత్యామ్నాయంగా నాగార్జునసాగర్ బొట్టుముక్కల లెఫ్ట్ పనులు చేపట్టాలని, 72 జీవో అమలు చేయాలని కోరారు. ఇప్పటివరకు జిల్లాలో చేపట్టిన అన్ని సాగునీటి పథకాలను పూర్తిచేయాలని, ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులను వెంటనే చేపట్టి రైతుల సాగినీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వివిధ సంఘాలలో పనిచేసిన తమ బృందమంతా ఇటీవల సమావేశమై జిల్లాలో సాగునీటి పరిస్థితుల గురించి చర్చించి ప్రాజెక్టుల సాధన జేఏసీగా సాగునీటి సాధనకు కృషి చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు జిల్లాలో ప్రాజెక్టుల పరిశీలన నిర్వహించడం జరిగిందన్నారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత జిల్లా నుంచి ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేవంత్ రెడ్డికి సాగునీటి విషయమై సమస్యను దృష్టికి తీసుకువచ్చేలా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు సభ్యులకు లేఖలు రాసినట్లు వివరించారు. ఇందులో భాగంగానే జిల్లా మంత్రికి కూడా వినతిపత్రం అందజేశారు. నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంగా మొదలైన తెలంగాణ ఉద్యమంలో రైతులు అధిక శాతం పాల్గొన్నారు. రాష్ట్ర సాధన జరిగితే తమ హక్కులు సాధించుకోవచ్చని ఆశించారని గుర్తు చేశారు. కానీ తెలంగాణ వచ్చి పుష్కరకాలం అవుతున్నప్పటికీ ఇప్పటిదాకా రైతుల ఆశలు నెరవేరలేదని పేర్కొన్నారు. ఇకనైనా పాలకులు స్పందించి పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని కోరారు..



# ఈనెల 20న మెడికల్ షాపుల బంద్ విజయవంతం చేయండి

**మన దునియా,సూర్యాపేట:మే 18**

సూర్యాపేట: ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్త మెడికల్ షాప్ లు బంద్ కు పిలుపునివ్వగా దానిలో భాగంగా ఈ నెల 20న సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఒకరోజు మెడికల్ షాపులను బంద్ చేయడం జరుగుతుందని. సూర్యాపేట జిల్లా, పట్టణ, ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈనెల 20న బంద్ కు సంబంధించి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్, జిల్లా ఎస్పీ కె నరసింహ, జిల్లా డ్రగ్ ఇన్స్ పెక్టర్ తో పాటు జిల్లా అధికారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి అనంతరం అసోసియేషన్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ అక్రమ ఈ ఫార్మసీలు వల్ల ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదము ఉన్నదని తెలిపారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలిక నోటిఫికేషన్ జి ఎస్ ఆర్ 220 ఈ ను వెంటనే ఉపసంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫార్మసీలకు సంబంధించిన జి.ఎస్.ఆర్ 817 ఈ నోటిఫికేషన్ ను రద్దు చేయాలని కోరారు. అలాగే కార్పొరేట్ సంస్థల అనైతిక డిస్కౌంట్లను అరికట్టేందుకు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెద్ద కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న కెమిస్ట్ లకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇది ఒక వ్యాపార సమస్యగా చూడవద్దు అని ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించినదని ప్రభుత్వాలు గుర్తించాలని కోరారు. కార్పొరేట్ సంస్థల వల్ల చిన్న ,మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ఉంటూ కొన్ని సంవత్సరాలుగా వ్యాపారాల మీద ఆధారపడి జీవిస్తున్న లక్షల కుటుంబాలు జీవన ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఆన్ లైన్ వ్యవస్థను నిర్మూలించాలని ప్రభుత్వాలను కోరారు. బంద్ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సూర్యాపేటలో బొడ్రాయి బజార్ లో శ్రీ వినాయక మెడికల్ షాపు , పీఎస్ఆర్ సెంటర్ లో వేదశ్రీ మెడికల్ షాపు, ఎంజి రోడ్ లో కార్తికేయ మెడికల్ షాపు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ ఒక్కరోజు బంద్ కు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యామ ప్రభాకర్, ఫార్మసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ముశం హరిప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపగాని గిరి గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా శ్రీనివాస్, కోశాధికారి చందన లింగయ్య, ఫార్మాసిటికల్ డిస్ట్రిబ్యూటర్స్ కోశాధికారి కర్నాటి వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు



# ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన 2008 ద్వారక స్కూల్ మిత్రబృందం

**మన దునియా దండపల్లి మే;18.**

మంచిర్యాల జిల్లా దండపెల్లి మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన కల్లు రాజేశ్వర్ కుటుంబాన్ని ఈరోజు 2008 ద్వారక స్కూల్ మిత్రబృందం సభ్యులు పరామర్శించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల రాజేశ్వర్ భర్త మామిడి రమేష్ చెట్టు మీద నుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబం తీవ్ర విషాదంలో ఉండగా, మిత్రబృందం సభ్యులు వారి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మిత్రబృందం సభ్యులు తమ వంతుగా సేకరించిన రూ.17,200 నగదు సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతేకాకుండా మృతుడి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి చదువులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబం ఒంటరిగా లేదని, తమకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు.సమాజంలో ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలబడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా మానవత్వం నిలుస్తుందని మిత్రబృందం సభ్యులు పేర్కొన్నారు. గ్రామంలో ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా అందరం కలిసికట్టుగా సహాయం చేసుకునే సంస్కృతి కొనసాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో 2008 ద్వారక స్కూల్ మిత్రబృందం సభ్యులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఏడు నిమిషాల్లో పనిచేసే క్యాన్సర్ ఇంజెక్షన్

**ఒక్క డోస్ ధర రూ.3.7 లక్షలు**

**ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు ఉపయోగం**

**క్యాన్సర్ కణాలను గుర్తించి నయం**

**ప్రభుత్వ పథకాల ద్వారా రీయింబర్స్‌మెంట్**

**మన దునియా,న్యూఢిల్లీ:మే18**



భారతదేశంలో క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక ముందడుగు పడింది. ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల కోసం కేవలం ఏడు నిమిషాల్లో పనిచేసే సరికొత్త ఇంజెక్షన్ అందుబాటులోకి వచ్చింది. రోచ్ ఫార్మా ఇండియా సంస్థ 'టెసెంట్రిక్' పేరుతో ఈ ఇమ్యునోథెరపీ మందును మార్కెట్‌లోకి విడుదల చేసింది.కీమోథెరపీలా కాకుండా ఇమ్యునోథెరపీ శరీరంలోని రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి క్యాన్సర్ కణాలపై పోరాడేలా చేస్తుంది. ఈ ఇంజెక్షన్‌లోని 'అటెజోలిజుమాబ్' అనే మందు క్యాన్సర్ కణాల్లో ఉండే పీడీ-ఎల్1 ప్రొటీన్‌ను అడ్డుకుంటుంది. ఇది బ్లాక్ అవడం వల్ల శరీరంలోని రోగనిరోధక కణాలు క్యాన్సర్ సెల్స్‌ను సులభంగా గుర్తించి నాశనం చేస్తాయి.ఈ మందుల తయారీలో వాడే అధునాతన సాంకేతికత, లోతైన పరిశోధనల వల్లే ధరలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. రోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి రోచ్ సంస్థ 'బ్లూ ట్రీ' అనే సహాయక కార్యక్రమాన్ని ప్రారంభించింది.

## ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధి


**మన దునియా,ఆత్మకూరు:మే18**



తుమ్మలపెనపహాడ్ గ్రామంలో మహిళా హత్య ఘటన స్థలం పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ భూ సంబంధిత తగాదాలు ఉంటే చట్ట పరిధిలో పరిష్కరించుకోవాలి, చట్టాన్ని ఉల్లంఘించి భౌతిక దాడులు హత్యలు చేస్తే జైలు శిక్షలు తప్పవు ఎస్పీ నర్సింహ ఐపీఎస్ గారు హెచ్చరించారు.ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మలపెనపహాడ్ గ్రామంలో భూతగాదాల నేపథ్యంలో జరిగిన మహిళ హత్య ఘటన స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ గారి పరిశీలించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఘటన జరిగిన ప్రదేశంలో క్లూస్ టీం సిబ్బంది, డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది ఆధారాలు సేకరించాయి. నేరానికి పాల్పడ్డ వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేసును వేగంగా దర్యాప్తు చేసి కోర్టుకు పంపించాలని అధికారులకు సూచించారు. ఎస్పీ గారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సురిగి సైదులు సొంత అక్క అంజమ్మకు ఇద్దరికీ భూవివాదం నెలకొని ఉంది, దీనికి సంబంధించి గతంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడం జరిగింది, ఇరువర్గాలను కూడా బైండోవర్ చేసి హెచ్చరించడం జరిగిందని తెలిపారు. అక్క ఉంటే భూమి నాకు దొరకదని అక్కను తప్పిస్తే త్వరగా భూమి తన సొంతం చేసుకోవచ్చని భావించిన నిందితుడు సైదులు సోమవారం రోజు ఉదయం కరువు పని నిమిత్తం వెళుతున్న అంజమ్మ పై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడని ఎస్పీ అన్నారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ భూ సంబంధిత తగాదాలు ఉంటే కోర్టుల సమక్షంలో, పెద్దమనుషుల సమక్షంలో చట్టపరంగా పరిష్కరించుకోవాలి అని చట్టాన్ని ఉల్లంఘించి భౌతిక దాడులు చేసిన హత్యలు చేసిన జైలుకు వెళ్లడం తప్పదు అని అన్నారు. గతంలో గరిడేపల్లి మండలంలో పొనుగోడు గ్రామంలో భూతగాదాలకు సంబంధించిన జరిగిన హత్య కేసులో నలుగురు నేరస్థులకు యావజ్జీవ కారాగార శిక్ష పడిందని గుర్తు చేశారు. సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. నేరానికి పాల్పడ్డ సైదులు పై ఆత్మకూరు పోలీస్ స్టేషన్ నందు హత్య కేసు నమోదు చేయడం జరిగింది త్వరితగతిన కేసు దర్యాప్తు చేసి నేరస్తులను శిక్ష పడేలా చేస్తామని బాధ్యత కుటుంబానికి న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కృషి చేస్తుందని అన్నారు.ఎస్పీ గారి వెంట సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, క్లూస్ టీం ఇన్స్పెక్టర్ నవీన్, ఎస్సైలు మహేష్, ఐలయ్య, గోపికృష్ణ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కలెక్టర్ సారు జర నాకు పింఛన్ ఇప్పించండి

**మన దునియా, వాజేడు, మే 18**




ములుగు జిల్లా వాజేడు మండలం చంద్రుపట్ల గ్రామ వాసి తునికి వేమాచారి కలెక్టర్ గారిని వేడుకుంటు నాకు గత నాలుగు సంవత్సరాల క్రితం ట్రాక్టర్ రోటవేటర్లలో కాలు పడి మోకాలు వరకు కాలు మొత్తం తెగి పోయినది కాలు తెగిపోవడంతో ఆర్థికంగా చాలా డబ్బులు ఖర్చు పెట్టుకుని ఇబ్బంది పడుతున్నాను నా కుటుంబంలో నేను పెద్ద దిక్కు కావడంతో పని చేసేవారు ఎవరూ లేకపోవడంతో నా భార్య చిన్న పిల్లలతో పూట గడవడమే ఇబ్బందిగా ఉన్నది నేను పూర్తిగా ఒక కాలు లేకపోవడంతో ఎటువంటి పనిచేసుకోలేకపోతున్నాను కావున నా భార్య పిల్లల్ని పోషించుకునే దానికి చాలా భారంగా అవుతున్నది ఆఫీసులో చుట్టూ తిరిగిన ఎటువంటి ఫలితం లేకపోయినది కావున ఇప్పటివరకు నాలుగు సంవత్సరాలు గడిచినది మీరు నాయందు దయవుంచి పింఛను వచ్చేటట్టు చేయగలరని నేను నా భార్య పిల్లలు వేడుకుంటున్నానని తెలియజేస్తున్నాను నేను బయటికి వెళ్లి పని చేసుకోలేకపోవడం వలన నా భార్య పిల్లలను పోషించుకోవడానికి వాళ్ళకు స్కూల్ ఫీజ్ కానీ బట్టలు గాని కొని పెట్టలేని స్థితిలోకి వచ్చినాను మీరు పెద్ద మనసు చేసుకొని నా కుటుంబ పరిస్థితిని చూసి నాకు పింఛన్ ఇప్పించగలరని కోరి ప్రార్థిస్తున్నాను



మన దునియా
RNI Number
మన అక్షరం – మన ప్రపంచం

# షుగర్ ఫ్రీ స్నాక్స్ ఆరోగ్యానికి మంచిదా?




కాలం మారుతున్న కొద్దీ మనం తినే ఆహారంలో కూడా విషపూరిత అంశాలు చేరిపోతున్నాయి. మనం రోజూ తినే ఆహారమే నేడు మనిషి ఎదుర్కొంటున్న అనేక వ్యాధులకు కారణం. మొదట్లో, చెడుకు బానిసలుగా ఉన్నవారు మాత్రమే అనారోగ్యానికి గురవుతారు. అయితే ఇప్పుడు మనం తినే ఆహారంలో కాస్త మార్పు వచ్చినా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో షుగర్, స్థూలకాయం, క్యాన్సర్ వంటి సమస్యలు పంచదారతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వస్తాయని చెప్పారు. అందువల్ల, చాలా మంది ప్రజలు చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం , చక్కెర లేని ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని గడుపుతున్నారని అనుకుంటారు. అయితే మనం అనుకున్నట్లుగా చక్కెర రహిత ఉత్పత్తులు నిజంగా ఆరోగ్యానికి మంచివేనా? దీని గురించి నిపుణులు ఏమంటారు? పేరు సూచించినట్లుగా, చక్కెరను ఉపయోగించకుండా చక్కెర రహిత ఉత్పత్తులు తయారు చేయబడతాయి . కానీ తీపి రుచిని అందించడానికి తక్కువ కేలరీలతో ప్రత్యామ్నాయ స్వీటెనర్లను ఉపయోగిస్తారు. అస్పర్టమే సాధారణంగా అటువంటి చక్కెర రహిత ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. వీటిని సాధారణంగా చూయింగ్ గమ్ , బేకింగ్ సోడాలో ఉపయోగిస్తారు. అస్పర్టమే కాకుండా, సాచరిన్ , సుక్రలోజ్ కూడా సాధారణంగా చక్కెర రహిత ఉత్పత్తులలో కనిపిస్తాయి. ఇప్పుడు మన ముందున్న ప్రశ్న ఏమిటంటే, చక్కెరను ఉపయోగించకుండా తయారు చేసే ఈ షుగర్ ఫ్రీ ఉత్పత్తుల వినియోగం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా, పోషకాహార నిపుణుడు అమిత గాద్రే ప్రకారం, చక్కెర కంటెంట్ వినియోగంతో పోలిస్తే చక్కెర లేని స్వీట్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. ఉత్పత్తులు. కానీ షుగర్ లేదనే కారణంతో ఎక్కువగా తినడం ప్రారంభిస్తే సమస్యలు వస్తాయి. పండుగల సమయంలో తరచుగా భోజనం చేయడంలో తప్పులేదు. ప్రతిరోజూ షుగర్ ఫ్రీ ఉత్పత్తులను తీసుకోవడం ఖచ్చితంగా మంచిది కాదు. షుగర్ ఫ్రీ క్యాండీలలో కూడా మీరు జాగ్రత్తగా ఉండాలి, ఎందుకంటే వాటిలో మీ క్యాలరీలను పెంచే ఇతర పదార్థాలు ఉంటాయి. అమిత ప్రకారం, మీరు వారానికి ఒకసారి చక్కెర లేని ఉత్పత్తిని తీసుకోవచ్చు. మిఠాయిల కోసం మార్కెట్లకు వెళ్లినప్పుడు రెండు రకాల స్వీట్లు దొరుకుతాయి. ఒకదానిలో షుగర్ వాడలేదని రాసి ఉండగా, మరో దానిలో షుగర్ ఫ్రీ అని రాసి ఉంది. మంచి ఆరోగ్యం విషయంలో దేన్ని ఎంచుకోవాలి అనే విషయంలో వినియోగదారులుగా మనం అయోమయం చెందడం సర్వసాధారణం. అయితే రెంటికి ఏమైనా తేడా ఉందా? లేక వీరిద్దరూ మిఠాయిల కోవకు చెందినవారే అనే సందేహం రావడం సహజం. వారు చక్కెరను ఉపయోగించరు లేదా చక్కెర రహితంగా లేబుల్ చేయబడిన ఉత్పత్తులలో చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఏ ఇతర ఉత్పత్తిని ఉపయోగించరు. కానీ ఆ మిఠాయిని తయారు చేయడానికి ఉపయోగించే ఇతర పదార్థాలు తీపి భాగం కలిగి ఉండవచ్చు. కానీ షుగర్ ఫ్రీ ఉత్పత్తులలో చక్కెర ఉండదు. బదులుగా, అస్పర్టమే, సాచరిన్ , సుక్రలోజ్ వంటి పైన పేర్కొన్న పదార్థాలు ఉపయోగించబడతాయి. వీటిలో ఏది తినాలనేది మన ఇష్టం.

## ఉద్యోగులు చేయి, మణికట్టు నొప్పితో ఎందుకు బాధపడుతున్నారు..?



నిరంతరం కంప్యూటర్ ముందు కూర్చునే వృత్తి నిపుణులు పని చేయడం సహజం. రోజులో ఎక్కువ భాగం పనికి కేటాయించడం అనేది కొంత మందిలో ఏదో ఒక అవసరం , ఆధునిక జీవనశైలి వలె దీనిని నివారించలేము అనేది కూడా వాస్తవం. చాలా మంది పని నిపుణులు పనిలో ఎక్కువ గంటలు గడపడం వంటి అనేక కారణాల వల్ల వేళ్లు, మణికట్టు, మోచేతులు , చేతుల్లో తీవ్రమైన నొప్పిని అనుభవిస్తారు. ఈ నొప్పిని తనిఖీ చేయకపోతే, ఇది దీర్ఘకాలిక చలనశీలత సమస్యలకు దారి తీస్తుంది. మీరు చేయగలిగే అనేక చేతి వ్యాయామాలు ఉన్నాయి, దీని కోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్ మీకు మార్గనిర్దేశం చేయవచ్చు. ఆఫీసుకు వెళ్లేవారిలో చేయి నొప్పికి ఆరు సాధారణ కారణాల గురించి తెలుసుకుందాం. కంప్యూటర్‌ను ఉపయోగిస్తున్నప్పుడు టైపింగ్, మౌస్ ఉపయోగించడం, చేతిని నిరంతరం ఎత్తడం వంటి పునరావృత కదలికలు తరచుగా జరుగుతాయి, ఇది కండరాలు, స్నాయువులు , నరాలలో మంట , మైక్రోట్రామాకు దారితీస్తుంది. ఇది సాధారణంగా మణికట్టు, మోచేతులు , భుజాలను ప్రభావితం చేస్తుంది. కీబోర్డ్ , మౌస్ ఎక్కువసేపు ఉపయోగించడం వల్ల తరచుగా చేతులు , మణికట్టులో నొప్పి వస్తుంది. కొన్నిసార్లు తప్పు టైపింగ్ టెక్నిక్ లేదా గ్రిప్ ఉపయోగించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం మధ్యమధ్యలో చిన్నపాటి విరామాలు తీసుకోవడం, చేతులు, చేతులు, భుజాలను సాగదీయడం వంటి సాధారణ వ్యాయామాలు చేయవచ్చు. మీ కుర్చీ చాలా ఎత్తుగా లేదా చాలా తక్కువగా ఉంటే లేదా మీ డెస్క్ , మానిటర్ సరిగ్గా సర్దుబాటు చేయకపోతే, అది మీ మెడ, భుజాలు , చేతుల్లో ఒత్తిడిని కలిగిస్తుంది . ఈ నొప్పి మీ మణికట్టును ప్రభావితం చేసే కార్పల్ టన్నెల్ సిండ్రోమ్ , స్నాయువుల వాపు వంటి టెండినిటిస్ వంటి సమస్యలను కలిగిస్తుంది. మీకు సరిపోయేలా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం ఈ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. మీరు విరామం లేకుండా చాలా గంటలు పని చేస్తున్నారని గమనించండి. వ్యాయామం లేకపోవడం లేదా శారీరక శ్రమ లేకపోవడంతో పాటు పెరిగిన పని , ఒత్తిడి తీవ్రమైన నొప్పికి దారి తీస్తుంది. టెన్నిస్ ఎల్బో లేదా గోల్ఫర్స్ ఎల్బో వంటి టెండినిటిస్ (కండరాల వాపు) వంటి పరిస్థితులను నిర్ధారించడానికి మీ వైద్యుడికి వైద్య పరీక్ష సహాయపడుతుంది , ఇవి మోచేయిని ప్రభావితం చేసే సాధారణ సమస్యలు. ముఖ్యంగా పునరావృత కార్యకలాపాలు చేసే వ్యక్తులలో ఈ నొప్పులు సర్వసాధారణం. అలాంటి నొప్పి లేదా అసౌకర్యం ఉంటే, వైద్యుడిని చూడటం మంచిది. ఒక వ్యక్తి పేలవమైన , నిష్క్రియాత్మక జీవనశైలిని నడిపించినప్పుడు , శారీరక శ్రమలకు తక్కువ సమయం ఇచ్చినప్పుడు, వారు కండరాల నొప్పి సమస్యను అభివృద్ధి చేయవచ్చు. అదనంగా, ధూమపానం లేదా ఊబకాయం , మునుపటి గాయాలు లేదా మధుమేహం , ఆర్థరైటిస్ వంటి సమస్యలను కలిగి ఉన్న వ్యక్తులు చేతులు , చేతుల్లో నొప్పిని కలిగి ఉంటారు. దీని కోసం, క్రమం తప్పకుండా స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి , మీ పని స్థలాన్ని మీకు సౌకర్యవంతంగా ఉంచండి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోండి.

## తిప్పతీగ ఆకు తింటే తిప్పలన్నీ మాయం..



తిప్పతీగ ఆయుర్వేదంలో చాలా పురాతనమైన ఔషధ మొక్క. దీని ఆకులు, కాండం రెండూ అనేక ఆరోగ్య సమస్యలకు మంచి ఔషధంగా పనిచేస్తాయి. ఈ మొక్కలో పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది. 1. ఎముకలు: తిప్ప తీగను ప్రధానంగా ఎముకల బలహీనత, విరుగుడు గాయాలు (ఫ్రాక్చర్) సందర్భాలలో ఉపయోగిస్తారు. ఇది ఎముక కణాలను పునరుత్పత్తి చేస్తుంది. విరిగిన ఎముకలు మళ్లీ త్వరగా కుదించడానికి సహాయపడుతుంది. ఇందులో కాల్షియం, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇది ఎముకల కండరాలను బలపరుస్తుంది. 2. జీర్ణక్రియ: తిప్ప తీగ ఆకులను జీర్ణ సమస్యలకు ఆయుర్వేద వైద్యంలో విరివిగా ఉపయోగిస్తారు. ఇది అజీర్ణం, గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. తిప్ప తీగ ఆకుల ముద్దను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. 3. బరువు తగ్గడం: బచ్చలి కూరను బరువు తగ్గించే ప్రక్రియలో కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో ఉండే కాంపౌండ్స్ కొవ్వును కరిగించి శరీరంలో కొవ్వు నిల్వలను తగ్గిస్తాయి. ఇది శరీరంలో జీవక్రియను పెంచుతుంది. తద్వారా క్యాలరీలు తక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది సహాయపడుతుంది. 4. చక్కెర నియంత్రణ: తిప్పతీగ ఆకులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారికి ఇది ప్రధానంగా ఉపయోగపడుతుంది. ఈ మొక్కలోని రసాయనాలు ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచుతాయి. అందువలన, ఇది మధుమేహం ప్రభావాన్ని తగ్గిస్తుంది. 5. కీళ్లనొప్పులు: తిప్ప తీగలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. కీళ్లనొప్పులు వంటి వ్యాధుల నివారణలో ఈ మొక్కను ఉపయోగించడం వల్ల శరీరంలోని కీళ్లలో మంట మరియు నొప్పులు తగ్గుతాయి. జాయింట్ సెన్సిటివిటీని తగ్గించడం ద్వారా జాయింట్ ఫ్లెక్సిబిలిటీని మెరుగుపరుస్తుంది. 6. చర్మ సమస్యలు: తిప్ప తీగ ఆకులు చర్మ సమస్యలకు ఉపయోగపడతాయి. ఇందులోని క్రిమినా శక లక్షణాలు కోతలు, కాలిన గాయాలు, చర్మ ఇన్ఫెక్షన్ల వంటి చర్మ సమస్యలను నివారిస్తాయి. ఆకును రసాన్ని తీసుకుని చర్మానికి రాసుకుంటే చర్మంపై జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

## ఈ టీలు తాగితే చాలు.. బెల్లీ ఫ్యాట్ కరిగిపోవడం ఖాయం!



ప్రస్తుత రోజుల్లో స్త్రీ పురుషులు చాలామంది అధిక బరువు బెల్లీ ఫ్యాట్ సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా చాలామంది వారి సొంత పనులు చేసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతూ ఉంటారు.కొన్ని కొన్ని సార్లు ఈ బెల్లీ ఫ్యాట్ కారణంగా బాడీ షేమింగ్ కామెంట్స్ ని కూడా ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. అయితే ఈ బెల్లీ ఫ్యాట్ ని కరిగించుకోవడం కోసం కొన్ని రకాల టీలు బాగా ఉపయోగపడతాయి అని చెబుతున్నారు. ఇంతకీ ఆ టీ లు ఏవి అన్న విషయానికి వస్తే.. బరువు తగ్గడానికి ఉపయోగించే తీలను స్లిమ్మింగ్ టీలు అని పిలుస్తారు. ఈ స్లిమ్మింగ్ టీకి దాని ప్రభావాన్ని అందించే రెండు ప్రాథమిక పదార్థాలు కెఫిన్ , పాలీఫెనాల్స్. అదనపు ట్రైగ్లిజరైడ్‌లను కరిగించే నిర్దిష్ట ఎంజైమ్‌ను ప్రేరేపించడం ద్వారా, పాలీఫెనాల్స్ భాగం శరీరంలో అధిక ట్రైగ్లిజరైడ్ ఏర్పడే ప్రమాదాన్ని తొలగిస్తుందట. అలాగే శరీరంలో కొవ్వును సైతం కరిగిస్తుందని చెబుతున్నారు. కాగా స్లిమ్మింగ్ టీ తాగడం వల్ల జీవక్రియ రేటును పెంచడంలో సహాయపడుతుందట. ఇది శరీరంలో కొవ్వును చాలా తొందరగా కరిగిస్తుందని, ఇది వినియోగించే కేలరీల పరిమాణాన్ని కూడా తగ్గిస్తుందని చెబుతున్నారు. కార్బోహైడ్రేట్లు, చక్కెరలను కొవ్వుగా మార్చకుండా శరీరాన్ని నిరోధిస్తుందట. ఇది శరీరంలో ని కొవ్వు పరిమాణాన్ని తగ్గిస్తుందని, మీరు బరువు తగ్గడానికి కొన్ని సులభమైన కార్యకలాపాలతో స్లిమ్మింగ్ టీని కూడా తాగేస్తే, సులభంగా బరువు తగ్గవచ్చని చెబుతున్నారు వైద్యులు. బయట మార్కెట్లో మనకు అనేక రకాల స్లిమ్మింగ్ టీలు అందుబాటులో ఉన్నాయి. వాటిని తాగడం వల్ల ఈజీగా మీరు అధిక బరువుతో పాటు బెల్లీ ఫ్యాట్ ని కూడా కరిగించుకోవచ్చు.

## ఈ ఫేస్ ప్యాక్ ట్రై చేస్తే చాలు.. నిముషాల్లో స్కిన్ మెరిసిపోవాల్సిందే!

చాలామంది స్త్రీ పురుషులు అందంగా కనిపించడం కోసం వేలకు వేలు డబ్బులు ఖర్చు చేస్తూ ఉంటారు. బ్యూటీ పార్లర్ల చుట్టూ తిరుగుతూ, రకరకాల బ్యూటీ ప్రోడక్టులు ఉపయోగిస్తూ ఉంటారు. ఇంకొందరు సహజంగా కనిపించే అందం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. కొందరు ఫంక్షన్ల కోసం నిమిషాల్లోనే మెరిసిపోయే స్కిన్ కావాలని కోరుకుంటూ ఉంటారు. మరి అలాంటి వాళ్ళు ఎటువంటి ఫేస్ ప్యాక్ ట్రై చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. అందులో మొదటిది శనగపిండి, పసుపు ఫేస్ ప్యాక్ కూడా ఒకటి. ఈ ప్యాక్ చేయడానికి మీరు రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండి, ఒక టీస్పూన్ పసుపు పొడిని కలపాలి. పేస్ట్ చేయడానికి పాలు లేదా రోజ్ వాటర్ ఉపయోగించవచ్చు. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 20 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత శుభ్రం చేస్తే సరిపోతుందట. మరొక రెమిడీ విషయానికి వస్తే.. బంగాళదుంప అలోవెరా, శెనగపిండి ఫేస్ ప్యాక్.. అయితే ఈ ప్యాక్ చేయడానికి బంగాళదుంప గుజ్జు, అలోవెరా జెల్ , రెండు టేబుల్ స్పూన్ల శెనగపిండిని కలపాలి. మీరు పేస్ట్ చేయడానికి నీటిని ఉపయోగించవచ్చు. ఈ ఈజ్ ఫేస్ ప్యాక్‌ని అప్లై చేసి, మీ చర్మంపై 10 నిమిషాల పాటు ఉంచి, తర్వాత శుభ్రం చేయవచ్చని చెబుతున్నారు. మరో ఫేస్ ప్యాక్ విషయానికి వస్తే.. నిమ్మకాయ టమాటో ఫేస్ ప్యాక్ తో ఇన్స్టంట్ అందాన్ని పొందవచ్చు అని చెబుతున్నారు. మరి ఈ మిశ్రమాన్ని ఎలా తయారు చేసుకోవాలి అన్న విషయానికి వస్తే.. ఈ ప్యాక్ కోసం, టొమాటో గుజ్జును తీసుకొని, ఒక టీస్పూన్ నిమ్మరసం జోడించాలి. అలా అప్లై చేసి 15 నిమిషాల పాటు అలాగే ఉంచి ఆ తర్వాత ముఖం శుభ్రం చేసుకోవాలి. మెరిసే చర్మం సొంతం కావాలి అనుకున్న వారు కాఫీ పాలు ప్యాక్ ట్రై చేస్తే చాలు. అందుకోసం ఈ రెండు పదార్థాలను 2:1 నిష్పత్తిలో కలిపి, మీ ముఖం మీద అప్లై చేయాలి. పాలలోని లక్షణాలు మీ చర్మానికి స్థితిస్థాపకతను నిర్ధారిస్తాయి. ఇది ముఖంపై ముడతలను తగ్గించడంతో పాటు, ముఖం మెరిసిపోయేలా చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.



## అందం కోసం విలువైన రహస్యం పటిక



పటిక అనేది బహుముఖ సహజ నివారణ. పటికను మీరు సాధారణంగా కొన్ని షాపుల్లో చూసే ఉంటారు. ఈ పటికలో క్రిమి సంహారక గుణాలు కలిగి ఉండడంతో, గాయాలైనప్పుడు రక్తం కారిపోకుండా పటిక కాపాడగలదు. ఇందులోని పొటాషియం, అల్యూమినియం, సల్ఫేట్ అనే రసాయన పదార్థాలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరిస్తాయి. ఇది జుట్టును శుభ్రపరచడంలో, శరీరంపై ముడుతలకు చికిత్స చేయడంలో, చెమటను నియంత్రించడంలో, చిగుళ్ల రక్తస్రావం నుండి ఉపశమనం పొందడంలో ఇంకా మూత్ర ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి మరియు చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికను దంతాలను శుభ్రపరచడానికి, చిగుళ్ళను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తారు. ఇది పంటి నొప్పిని కూడా తగ్గిస్తుంది. పటికలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇది చర్మంపై ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. పటిక నీటితో జుట్టు కడగడం వల్ల తలపై ఉన్న జుట్టులో ఉండే మురికి, పేలు వంటి తొలిగిపోతాయి. పటికను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం మీ జుట్టును కడగాలి. యూరిన్ ఇన్ఫెక్షన్ నుండి ఉపశమనం కలిగించేందుకు ప్రైవేట్ పార్ట్ లను శుభ్రం చేయడానికి పటిక నీరు ఉపయోగపడుతుంది. పటిక నీటితో పుక్కిలించడం చిగుళ్ల నుండి రక్తస్రావం నుండి ఉపశమనం కలిగిస్తుంది. నోటి దుర్వాసనను కూడా తగ్గిస్తుంది. పటిక పొడి శరీరంలో వాపు, నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. ప్రభావిత ప్రాంతంపై దీన్ని పూయడం మంచిది. పటిక నీటిని ముఖానికి పట్టించడం వల్ల ముడతలు తగ్గుతాయి. రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల చర్మం బిగుతుగా, కాంతివంతంగా మారుతుంది. పటిక చెమట వాసనను తగ్గించడంలో సహాయపడుతుంది. పటిక నీటితో స్నానం చేయడం వల్ల చెమట సమస్య తగ్గుతుంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# సీఎస్కేతో సమరానికి సన్‌రైజర్స్ సై... ఇవాళ కూడా ధోనీ లేడు!

**సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్**

**మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్న కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్**

**ఫిట్‌గా లేకపోవడంతో ఈ మ్యాచ్‌కు ఎంఎస్ ధోనీ దూరం**

**తాము కూడా బౌలింగే ఎంచుకునేవాళ్లమని చెప్పిన సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్**

**చెన్నై జట్టులోకి అకీల్ హోసేన్.. హైదరాబాద్ జట్టులో మార్పుల్లేవు**



ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియంలో జరుగుతున్న కీలక పోరులో చెన్నై సూపర్ కింగ్స్ టాస్ గెలిచింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. అయితే, చెన్నై అభిమానులకు నిరాశ కలిగించేలా, స్టార్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఈ మ్యాచ్‌కు కూడా ఫిట్‌నెస్ కారణంగా దూరమయ్యాడు.టాస్ గెలిచిన అనంతరం రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ.. "మేం మొదట బ్యాటింగ్ చేయాలనుకుంటున్నాం. ఒక్కో మ్యాచ్‌పై దృష్టి పెడుతూ ముందుకు సాగుతాం. పరిస్థితులను సరిగ్గా అంచనా వేసి, ఉత్తమ ప్రదర్శన ఇవ్వడమే మా లక్ష్యం. ధోనీ ఇక్కడే ఉన్నాడు, కానీ ఈ మ్యాచ్ ఆడేంత ఫిట్‌గా లేడు. ఈ మ్యాచ్ గెలిస్తే, అతను చివరి మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంటుంది" అని చెప్పాడు. జట్టులో గుర్జపనీత్ స్థానంలో అకీల్ హోసేన్‌ను తీసుకున్నట్లు వెల్లడించాడు.సన్‌రైజర్స్ కెప్టెన్ పాట్ కమిన్స్ మాట్లాడుతూ.. తాము కూడా బౌలింగే చేయాలని భావించామని, కాబట్టి టాస్ ఓడినా నిరాశ లేదని అన్నాడు. "ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడమే మా లక్ష్యం. మా దూకుడు శైలి కొన్నిసార్లు ఫలితం ఇవ్వకపోయినా, దానికే కట్టుబడి ఉంటాం. గత మ్యాచ్ ఆడిన జట్టుతోనే బరిలోకి దిగుతున్నాం" అని కమిన్స్ పేర్కొన్నాడు.

సన్‌రైజర్స్ హైదరాబాద్

అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, స్మరన్ రవిచంద్రన్, నితీశ్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్ (కెప్టెన్), శివంగ్ కుమార్, ఎషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే.

చెన్నై సూపర్ కింగ్స్

సంజూ శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఉర్విల్ పటేల్, కార్తీక్ శర్మ, డెవాల్డ్ బ్రెవిస్, శివమ్ దూబే, ప్రశాంత్ వీర్, అకీల్ హోసేన్, నూర్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, స్పెన్సర్ జాన్సన్.

ఇంపాక్ట్ సబ్స్:

సన్‌రైజర్స్ హైదరాబాద్: ట్రావిస్ హెడ్, అనికేత్ వర్మ, లియామ్ లివింగ్‌స్టోన్, హర్ష్ దూబే, హర్షల్ పటేల్. చెన్నై సూపర్ కింగ్స్: ముఖేష్ చౌదరి, మాథ్యూ షార్ట్, సర్ఫరాజ్ ఖాన్, అమన్ ఖాన్, గుర్జపనీత్ సింగ్.

# ప్లేఆఫ్స్‌కు దూసుకెళ్లిన సన్‌రైజర్స్... చెపాక్ లో సీఎస్కే జట్టుకు చెక్

**చెన్నైపై 5 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ ఘన విజయం**

**ఈ విజయంతో అధికారికంగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన ఎస్ఆర్‌హెచ్**

**ఇషాన్ కిషన్ (70), క్లాసెన్ (47) అద్భుత ఇన్నింగ్స్‌లతో జట్టుకు విజయం**

**ఓటమితో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు క్లిష్టతరం**

**పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో మూడో స్థానానికి చేరిన హైదరాబాద్**

**నేటి మ్యాచ్ ఫలితంతో గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ బెర్తు కూడా ఖరారు**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత ప్రదర్శనతో ప్లేఆఫ్స్ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకుంది. సోమవారం నాడు చెన్నైలోని ఎంఎ చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్‌ల అద్భుత బ్యాటింగ్‌తో ఆరెంజ్ ఆర్మీ మరో ఓవర్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. ఈ ఓటమితో చెన్నై ప్లేఆఫ్స్ అవకాశాలు మరింత సంక్లిష్టంగా మారాయి. మరోవైపు, నేటి మ్యాచ్ ఫలితంతో గుజరాత్ టైటాన్స్ కూడా ప్లేఆఫ్ బెర్తును ఖరారు చేసుకోవడం విశేషం.181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ట్రావిస్ హెడ్ (6), అభిషేక్ శర్మ (26) త్వరగా వెనుదిరిగారు. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 70; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), హెన్రిచ్ క్లాసెన్ (26 బంతుల్లో 47; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) భారీ షాట్లతో చెలరేగారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 75 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను చెన్నై నుంచి లాగేసుకున్నారు. చివర్లో నితీశ్ రెడ్డి (11), సలీల్ అరోరా (10బి) తమ వంతు పరుగులు చేయడంతో సన్‌రైజర్స్ 19 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది.అంతకుముందు, టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. డెవాల్డ్ బ్రెవిస్ (27 బంతుల్లో 44), కార్తీక్ శర్మ (19 బంతుల్లో 32) రాణించగా, ఆరంభంలో సంజూ శాంసన్ (13 బంతుల్లో 27) మెరుపులు మెరిపించాడు. అయితే, సన్‌రైజర్స్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (4 ఓవర్లలో 28 పరుగులిచ్చి 3 వికెట్లు) తన అద్భుత బౌలింగ్‌తో చెన్నైని కట్టడి చేశాడు. అతనికి షకీబ్ హుస్సేన్ (2 వికెట్లు) చక్కటి సహకారం అందించాడు.

గుజరాత్ కూడా..!

ఈ గెలుపుతో సన్‌రైజర్స్ 13 మ్యాచ్‌ల్లో 8 విజయాలు సాధించి, 16 పాయింట్లతో పట్టికలో మూడో స్థానానికి చేరింది. తద్వారా ప్లే ఆఫ్ బెర్తును ఖాయం చేసుకుంది. అదే సమయంలో, 13 మ్యాచ్ లలో 8 విజయాలతో ఉన్న గుజరాత్ టైటాన్స్ బెర్తు కూడా ఖరారైంది. మరోవైపు, ఈ ఓటమితో చెన్నై ప్రయాణం కష్టాల్లో పడింది. 13 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో 12 పాయింట్లు మాత్రమే సాధించి ఆరో స్థానంలో నిలిచింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గెలవడంతో పాటు, పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన క్లిష్ట పరిస్థితిలో సీఎస్కే చిక్కుకుంది.



# ఒకరు మెచ్చారు.. మరొకరు హెచ్చరించారు.. వైభవ్‌పై భజ్జీ, కైఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు!

**భారత జట్టుకు ఆడాలంటే వైభవ్ ఫీల్డింగ్ మెరుగుపరుచుకోవాలన్న కైఫ్**

**యువ ఆటగాడి ప్రతిభపై భిన్నంగా స్పందించిన భారత మాజీ క్రికెటర్లు**



యువ సంచలనం, రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్లు భిన్నరీతిలో స్పందించారు. బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నా, ఫీల్డింగ్‌లో చాలా మెరుగుపడాల్సి ఉందని మహమ్మద్ కైఫ్ హెచ్చరించగా, అతని బ్యాటింగ్ శైలిని హర్భజన్ సింగ్ ఆకాశానికెత్తాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ ఓటమి అనంతరం వీరిద్దరూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 21 బంతుల్లోనే 46 పరుగులు చేసి అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించాడు.ఈ సందర్భంగా మహమ్మద్ కైఫ్ మాట్లాడుతూ.. వైభవ్ భారత జట్టుకు ఆడాలంటే తన ఫీల్డింగ్ నైపుణ్యాలను తప్పనిసరిగా మెరుగుపరుచుకోవాలని స్పష్టం చేశాడు. "ఆటగాళ్లను ఎంపిక చేసే స్కౌట్లు ఫీల్డింగ్ టెస్టు కూడా నిర్వహించాలి. వైభవ్ ఒక్క క్యాచ్ కూడా పట్టినట్టు నేను చూడలేదు. ఢిల్లీతో మ్యాచ్‌లో ఒక బంతి మంచి ఎత్తులో అతని వద్దకు వచ్చింది. ఆ క్యాచ్ పట్టడానికి అతను సరైన పొజిషన్‌లో ఉన్నప్పటికీ, అనవసరంగా గాల్లోకి ఎగిరి జారవిడిచాడు. బ్యాటింగ్‌లో అతను చాలా ప్రతిభావంతుడు, కానీ ఫీల్డింగ్ విషయంలో అతను ఇంకా సిద్ధంగా లేడు" అని కైఫ్ విశ్లేషించాడు.మరోవైపు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ మాత్రం వైభవ్ బ్యాటింగ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్‌ను ఎదుర్కోవడం ఏ బౌలర్‌కైనా సవాల్ అని అన్నాడు. "వైభవ్‌కు బౌలింగ్ చేయాల్సి వస్తే, ఎలాగైనా అతని వికెట్ తీయాలనే ప్లాన్‌తో వెళతా. కానీ, అతను ఉన్న ఫామ్‌కు అది కష్టమే. అతని హిట్టింగ్ ఆర్క్‌కు దూరంగా బంతిని స్పిన్ చేయడమే నా వ్యూహం. నేను ఎంతో మంది ఆటగాళ్లతో ఆడాను. క్రిస్ గేల్ వికెట్‌ను కూడా చాలాసార్లు తీశాను. కానీ, వైభవ్ ఒక డిఫరెంట్ లెవెల్. 15 ఏళ్ల వయసులో ప్రతి బౌలర్‌ను సిక్సర్లు కొట్టడం మాములు విషయం కాదు" అని భజ్జీ కొనియాడాడు.మొత్తం మీద బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్ సూర్యవంశీ, ఫీల్డింగ్‌లో కూడా రాణిస్తేనే జాతీయ జట్టులో స్థానం సులభమవుతుందని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సీఎస్కే బ్యాటర్లకు కళ్లెం వేసిన సన్ రైజర్స్ బౌలర్లు.. ఆకట్టుకున్న కమిన్స్

**సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు 181 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన చెన్నై**

**44 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన డెవాల్డ్ బ్రెవిస్**

**మూడు కీలక వికెట్లు పడగొట్టిన హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్**

**నిదానంగా ఆడి నిరాశపరిచిన సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్**

**కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్న సన్‌రైజర్స్ బౌలర్లు**

సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చెన్నై, నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి చెన్నైని భారీ స్కోరు చేయకుండా నిలువరించారు. చెన్నై బ్యాటర్లలో డెవాల్డ్ బ్రెవిస్ (44) టాప్ స్కోరర్‌గా నిలవగా, హైదరాబాద్ బౌలర్లలో కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మూడు కీలక వికెట్లతో ఆకట్టుకున్నాడు.టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకి ఓపెనర్లు మంచి ఆరంభాన్ని ఇవ్వలేకపోయారు. సంజూ శాంసన్ (13 బంతుల్లో 27) మెరుపులు మెరిపించినా, కమిన్స్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత ఉర్విల్ పటేల్ (13) కూడా త్వరగానే ఔటయ్యాడు. అయితే, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మరోసారి నెమ్మదిగా ఆడి నిరాశపరిచాడు. 21 బంతులు ఎదుర్కొని కేవలం 15 పరుగులు మాత్రమే చేసి కమిన్స్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. దీంతో చెన్నై 11.3 ఓవర్లలో 100 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.ఈ దశలో కార్తీక్ శర్మ (19 బంతుల్లో 32), డెవాల్డ్ బ్రెవిస్ (27 బంతుల్లో 44), శివమ్ దూబే (23 బంతుల్లో 26) బాధ్యతాయుతంగా ఆడారు. ముఖ్యంగా బ్రెవిస్, దూబే ఐదో వికెట్‌కు 59 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును పరుగులెత్తించారు. బ్రెవిస్ తన ఇన్నింగ్స్‌లో 2 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో అలరించాడు. చివరి ఓవర్లలో హైదరాబాద్ బౌలర్లు పుంజుకోవడంతో చెన్నై ఆశించిన స్థాయిలో స్కోరు నమోదు చేయలేకపోయింది.సన్‌రైజర్స్ బౌలర్లలో కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తన అద్భుతమైన బౌలింగ్‌తో చెన్నై బ్యాటింగ్ లైనప్‌ను దెబ్బతీశాడు. 4 ఓవర్లలో కేవలం 28 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. అతనికి తోడుగా సాకిబ్ హుస్సేన్ 2 వికెట్లు తీయగా, ఎషాన్ మలింగ, ప్రఫుల్ హింగే తలో వికెట్ దక్కించుకున్నారు. నితీష్ కుమార్ రెడ్డి రెండు ఓవర్లలో 35 పరుగులు ఇచ్చాడు.



మన దునియా
RNI Number TTTTT/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

# రష్మిక టాటూ వెనుక ఆసక్తికర ఘటన!

రష్మిక మణికట్టుపై 'ఇర్రీప్లేసబుల్' అనే టాటూ

కాలేజీ రోజుల్లో రష్మికకు ఎదురైన ఒక అనుభవం

అమ్మాయిలు నొప్పిని భరించలేరని ఎగతాళిగా మాట్లాడిన ఒక అబ్బాయి

ఆ మాటలను ఛాలెంజ్‌గా తీసుకున్న రష్మిక



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న నటనతోనే, తన వ్యక్తిగత విషయాలతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఆమె కుడిచేతి మణికట్టుపై ఉన్న 'ఇర్రీప్లేసబుల్' అనే టాటూ గురించి సోషల్ మీడియాలో నిరంతరం రకరకాల పుకార్లు షికారు చేస్తూనే ఉన్నాయి. ఈ టాటూను ఆమె హీరో విజయ్ దేవరకొండ కోసమే ప్రత్యేకంగా వేయించుకుందంటూ నెటిజన్లు రకరకాల కథనాలను ప్రచారం చేస్తున్నారు. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన రష్మిక, ఈ టాటూ వెనుక ఉన్న అసలైన నిజాన్ని, దానికి దారితీసిన ఆసక్తికరమైన నేపథ్యాన్ని బయటపెట్టి ఆ పుకార్లకు పూర్తిగా చెక్ పెట్టారు.నిజానికి తనకు మొదట్లో శరీరంపై ఎలాంటి టాటూ వేయించుకోవాలనే ఆలోచనే లేదని రష్మిక స్పష్టం చేశారు. కానీ ఆమె కాలేజీ చదువుతున్న రోజుల్లో జరిగిన ఒక చిన్న సంఘటన ఆమె మనసును బలంగా తాకింది. ఒకరోజు కాలేజీలో ఒక అబ్బాయి రష్మిక దగ్గరకు వచ్చి, ఆడపిల్లలు అస్సలు నొప్పిని భరించలేరని... వారికి సూదులు, ఇంజెక్షన్లు అంటే చాలా భయమని కాస్త ఎగతాళిగా మాట్లాడాడు. ఆ మాటలను ఒక ఛాలెంజ్‌గా తీసుకున్న రష్మిక... ఆడవాళ్లు ఎంతటి నొప్పినైనా ఓర్చుకోగలరని నిరూపించడానికి, ఆ అబ్బాయి గర్వాన్ని అణచడానికే ఎలాగైనా టాటూ వేయించుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నారట. తీరా టాటూ వేయించుకోవాలని ఫిక్స్ అయిన తర్వాత, చేతిపై ఎలాంటి పదాన్ని రాయించుకోవాలా? అని చాలా సమయం ఆలోచించానని రష్మిక వెల్లడించింది. తన జీవితంలో ఎప్పుడూ చాలా సహజంగా, రియల్‌గా ఉండాలని కోరుకునే రష్మికకు ఒక బలమైన ఆలోచన వచ్చింది. ఈ ప్రపంచంలో ఏ ఒక్క మనిషిని మరొకరు ఎప్పటికీ భర్తీ చేయలేరని, ప్రతి ఒక్కరూ తమదైన శైలిలో ప్రత్యేకమైనవారని ఆమె బలంగా నమ్ముతారు. ఆ విషయాన్ని ప్రతిరోజూ తనకు తాను గుర్తుచేసుకోవడానికి, అలాగే తన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఒక మంచి లక్ష్యంగా ఉంచుకోవడానికి 'ఇర్రీప్లేసబుల్' అనే పదాన్ని టాటూగా ఎంచుకున్నట్లు రష్మిక క్లారిటీ ఇచ్చారు.

# 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది.. థియేటర్లలో మెగా జాతర ఖాయం!

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది. సోమవారం సాయంత్రం 4.05 గంటలకు ముంబయి వేదికగా గ్రాండ్‌గా విడుదలైంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ట్రైలర్ చూస్తుంటే థియేటర్లలో మెగా జాతర ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా రామ్‌చరణ్ మేకోవర్, ఆయన నటన, డైలాగ్స్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేలా ఉన్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామీణ నేపథ్యం ఉన్న స్పోర్ట్స్ డ్రామాను దర్శకుడు బుచ్చిబాబు ఎంత ఎమోషనల్‌గా తెరకెక్కించారో ట్రైలర్ స్పష్టం చేస్తోంది. చరణ్ గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఆటగాడిగా ఎదగడం గమనించొచ్చు. ఏఆర్ రెహ్మాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రత్నవేలు విజువల్స్ ట్రైలర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి.రామ్‌చరణ్ చెప్పిన కొన్ని డైలాగ్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. "మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు. నేను పోరాడాను సారు..." ఈ డైలాగ్ సినిమాలోని చరణ్ క్యారెక్టర్ తీవ్రతను, పోరాటాన్ని తెలియజేస్తోంది. "మాటలతో కాదు.. ఆటతో బరిలో గెలిచే మగతనం ఎవరికి ఉందో రమ్మను" అనే డైలాగ్ మాస్ ఆడియన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. మొత్తంగా 'పెద్ది' ట్రైలర్ సినిమాపై అంచనాలను ఓ రేంజ్‌కు తీసుకెళ్లింది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు మనసుకు హత్తుకునే ఎమోషన్స్ ఉన్న పక్కా పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ మెటీరియల్‌లా ఇది కనిపిస్తోంది. జూన్ 4న థియేటర్లలో చరణ్ బాక్సాఫీస్ వేట ఎలా ఉండబోతుందో చూడాలి! వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్మాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ రాజ్ కుమార్, జగపతి బాబు, ఉపేంద్ర లిమయే, కృతిశెట్టి, దివ్యేందు శర్మ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.






# శ్రీలీల, తిలక్ వర్మ డేటింగ్ రూమర్స్.. ఫుల్ క్లారిటీ ఇచ్చిన హీరోయిన్ తల్లి

**శ్రీలీల, తిలక్ వర్మ డేటింగ్ ప్రచారాన్ని ఖండించిన ఆమె తల్లి స్వర్ణలత**

**ప్రస్తుతం శ్రీలీల దృష్టి సినిమా కెరీర్, నీట్-పీజీ చదువులపైనే ఉందని వెల్లడి**

**తిరుమల దర్శనం, మ్యాచ్‌కు హాజరు కావడం యాదృచ్ఛికమేనని స్పష్టీకరణ**

**శ్రీలీల వ్యక్తిగత విషయాలపై ఆలోచించడానికి మరో 5-6 ఏళ్లు పడుతుందని వ్యాఖ్య**

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల, టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె తల్లి స్వర్ణలత తెరదించారు. ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆమె ఖరాఖండిగా తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న కథనాల్లో అణువంత కూడా నిజం లేదని, ఇలాంటి పుకార్లు ఎలా పుట్టుకొస్తాయో అర్థం కావడం లేదని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ఈ అంశంపై పూర్తి స్పష్టతనిస్తూ స్వర్ణలత మాట్లాడుతూ.. "ప్రస్తుతం శ్రీలీల తన సినీ కెరీర్‌తో పాటు చదువులపైనా పూర్తి దృష్టి పెట్టింది. సినిమా షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సమయం దొరికినప్పుడల్లా తన వైద్య విద్యపై ఏకాగ్రత చూపుతోంది. ముఖ్యంగా నీట్-పీజీ పరీక్ష కోసం సన్నద్ధమవుతోంది. ఆమె వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించే దశకు ఇంకా చాలా సమయం ఉంది. బహుశా మరో ఐదు నుంచి ఆరు సంవత్సరాల తర్వాతే ఆ విషయాలపై దృష్టి పెడుతుంది" అని వివరించారు.సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంఘటనల గురించి కూడా ఆమె ప్రస్తావించారు. 2025 డిసెంబర్‌లో తిరుమలలో శ్రీలీల, తిలక్ వర్మ కలిసి కనిపించడం, వాంఖడే స్టేడియంలో జరిగిన ఓ టీ20 మ్యాచ్‌కు శ్రీలీల హాజరుకావడం వంటివి కేవలం యాదృచ్ఛిక సంఘటనలేనని తెలిపారు. వాటి ఆధారంగా ఊహాగానాలు సృష్టించి సంబంధాన్ని అంటగట్టడం సరికాదని ఆమె హితవు పలికారు.గతంలో కార్తిక్ ఆర్యన్‌తో వచ్చిన వార్తలను కూడా గుర్తుచేసిన స్వర్ణలత  గతంలో కూడా శ్రీలీలపై ఇలాంటి ప్రచారమే జరిగిందని స్వర్ణలత గుర్తుచేశారు. బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల రిలేషన్‌లో ఉన్నారంటూ వచ్చిన వార్తలను ప్రస్తావిస్తూ.. "కార్తిక్ ఆర్యన్ తల్లి, నేను ఇద్దరం గైనకాలజిస్టులం. మా మధ్య ఉన్న వృత్తిపరమైన పరిచయాన్ని తప్పుగా అర్థం చేసుకుని అప్పట్లో ఇలాంటి కథనాలే సృష్టించారు" అని ఆమె పేర్కొన్నారు. సినీ తారల వ్యక్తిగత జీవితాలపై ఆధారాలు లేకుండానే కథనాలు ప్రచారం చేయడం తగదని, అభిమానులు ఇలాంటి పుకార్లను నమ్మవద్దని ఆమె సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ;   TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com